# ముప్పదియవ ప్రసంగము.

సాయంకాలము డా॥ లల్లూభాయి ఒకభక్తవరుని తోడ్కొని పీఠడియా వచ్చెను. స్వాములవారిద్దరును వారిని కుశలమడిగిరి. డా॥ లల్లూభాయి ఆభక్తుని ప్రకాశానందులవారికి ఎరుకపరచెను. ఈయన ఒకభక్తుడు. వీరు యోగవాశిష్ఠము, ఆత్మపురాణము మొదలగు గ్రంథములను చదివిరి. గురుశ్రీవారి జీవితమును చదివినమీదట వీరికి తమదర్శనము చేయవలెనని కోరిక కలిగినది.

స్వా. ప్ర. :— జీవితము గురుశ్రీవారిది. నాకు ఏమియును దానితో సంబంధము లేదు. నేను వినినవిషయములలో సూక్ష్మములైనవానిని గ్రహించలేకపోయితినికూడను. కొద్దియో గొప్పయో స్థూలవిషయములను మాత్రము వింటిని. వానిలోకూడ జ్ఞాపకము ఉన్నవిమాత్రమే వ్రాసితిని. వానినికూడ ఇప్పుడు ఆచరించలేకపోవుచున్నాను. "అది నేను వ్రాసితిని" అని మీరు అనుకొనుటతప్ప పైకి ఏమియును ఆధారములు కన్పించుటలేదు.

ఒకసంతు ఒకపుస్తకము వ్రాసెను. దానిని ఒకగ్రామమునందలి ఇద్దరు మిత్రులు చదివిరి. చదువుచుండ ఒకసంవత్సరములో వారిరువురును దైవసంపదను పొంది వైరాగ్యమును పొందిరి. వారు ఇరువురును తలచిరి :—ప్రపంచమునుండి ఇంత పూర్ణవైరాగ్యమును కలిగించు ఈగ్రంథమును వ్రాసిన మహాపురుషుడు పూర్ణజ్ఞాని అయి ఉండును. ఇట్లు తలచి వారు దూరదేశమునుండి ఆయనదర్శనము చేసికొనుటకు వారి ఆశ్రమమునకు వచ్చిరి. ఆయన పూర్తిగా మాయావి అని అచ్చట వారికి తెలియవచ్చెను. అన్నివిధములగు విషయములయందును చిక్కుపడియుండెను. ఆతడు విరాగికాడు. పూర్ణరాగి.

ఇది పరికించినవెంటనే వారు ఆమహాత్మ్ముని అడిగిరి:—"తమ పుస్తకము చదివినంతనే మాకు పూర్ణవైరాగ్యము కలిగినది. కాని తమరు మాత్రము అందుకు వ్యతిరేకముగా నున్నారు."

ఆమహాత్ముడు సమాధానము చెప్పెను:—

కమ్మరి శ్రమపడి వేలకొలది పదునుకల కత్తులను తయారుచేయును. కాని వానిని యుద్ధక్షేత్రములో ఉపయోగించు సామర్థ్యము అతనికి ఉండదు. శూరవీరులగు క్షత్రియులు మాత్రమే ఆతీక్ష్ణఖడ్గములను ఉపయోగించగలరు. నేను ఆకమ్మరిని. మీరు ఆశూరులును, వీరులును అగు క్షత్రియులు.

## సహవాసముచే యథార్థము గ్రహించనగును.

పుస్తకమునుబట్టి చూచినచో జ్ఞానియో, అజ్ఞానియో తెలిసికొనలేము. దగ్గరగానుండి చూచినచో గ్రంథకర్తరహస్యమును తెలిసికొనవచ్చును. సీతను వెదకుచు రామలక్ష్మణులు పంపాసరోవరసమీపమునుండి వెళ్లునప్పుడు ఆసరోవరమునందలి ఒకకొంగను చూచి రాముడు లక్ష్మణునితో నిట్లనెను:—

*పశ్య లక్ష్మణ పమ్పాయాం బకః పరమధార్మికః ।*
*శనైః శనైః పదం ధత్తే జీవానాం వధశఙ్కయా॥*

"ఓలక్ష్మణా! ఈపంపాసరోవరమునందలి కొంగ ఎంతధర్మము కలదియో చూడుము. జీవహింస జరుగునను భయముతో నెమ్మది నెమ్మదిగా అడుగులు వేయుచున్నది."

ఇది విని ఒక చేప పలికెను:—

*బకః కిం శ్లాఘ్యతే రామ యేనాహం నిష్కులీకృతా*
*సహవాసీ విజానాతి చరిత్రం సహవాసినామ్॥*

"ఓరామా! కొంగను ఏల పొగడుచున్నావు? ఇది మాకులము నంతను నాశనము చేసినది. కూడఉండువారే కూడఉండువారి చరిత్రము సరిగా ఎరుగుదురు."

(ఇచ్చట రామచంద్రునితో చేపచెప్పినది అనుదానిని అలంకార రూపముగనే గ్రహించవలెను.)

కాళాభాయి:— భక్తవరులకు తమసహవాసము ఇంతవరకు లభించలేదు. కాని మేము తమను చాలకాలమునుండి ఎరుగుదుము. తమసహవాసమున చాలకాలమునుండి ఉన్నాము. తమరు శ్మశానమునందు పడిఉండుటయు, ఎండిన రొట్టెముక్కలు తినుటయు, శీతోష్ణాదులు సహించుటయును మేము చూచుచునే ఉన్నాము.

స్వా. వి. :— శంకరులు పార్వతితో చెప్పిరి:—

తృణపర్ణోదకాహారాః సతతం వనవాసినః ।
హరిణాదిమృగా దేవి యోగినస్తే భవన్తి కిమ్॥

"గడ్డి, ఆకులు, నీరుమాత్రమే ఆహారముగా కలవారు యోగులు అయినచో లేళ్లు మొదలగు పశువులసంగతి యేమి? అవి యోగులా?"

అడవులలో భిల్లులు మొదలగువారుకూడ ఉందురు. వారిని యోగులు అనెదరా? దక్షిణదేశమున ఒకమహాత్ముని చూచితిని. ఆయన అరణ్యమున నివసించెడివాడు. లేత అరటిఆకులు భక్షించెడివాడు. అయినను ఆతని శరీరము నిలచియుండెను. కాని ఆయనయందు జ్ఞానముమాత్రము లేశమైనను లేకుండెను.

మృద్భస్మమక్షణాద్దేవి ముక్తాః స్యుర్యది మానవాః ।
మృద్భస్మశాయినో గ్రామ్యాః కిం తే ముక్తా భవన్తి హి॥

"మట్టికాని, భస్మముకాని శరీరమునకు పూసుకొనుటచేత యోగులు ముక్తినిపొందుచో మట్టిలోపరుండు కుక్కలు మొదలగు పవి బూడిదలో పరుండునుకదా! అవి ముక్తిని పొందునా?"

చాలమంది సాధువులు శరీరముపై భస్మము, మట్టి పూసుకొనెదరు. భస్మాదిధారణముచే వారి శరీరమునందలి ఛిద్రములు

మూసివేయబడును. వారికి చలివేయదు. పంచాగ్నితాపమును కూడ పొందరు. ఇట్లు కంబళీలు మొదలగునవి కప్పుకొనకుండుటకు వారి భస్మాదిధారణము ఉపయోగించును. "హిమాలయమున ఒకరకపు మూలిక కలదు; దాని భస్మము శరీరమునకు పట్టించుకొనినచో ఎటువంటి మంచునందు సంచరించినను చలివేయదు" అని నేను హృషీకేశమున వింటిని అటులనే తినెడి కందమూలములయందుకూడ విశేషము కలదు. ఒకరకపు దుంపను తినుటచే 8 రోజులవరకును ఆకలిదప్పికలు ఉండవు. మరియొకరకపుమూలిక పక్షమురోజులవరకును ఆకలిదప్పికలు లేకుండజేయును. ఇటులనే నెల, రెండునెలలు, మూడునెలలు, ఆరునెలల వరకుకూడ ఆకలిదప్పికలు లేకుండజేయు మూలికలు కలవు. వానిని ఉపయోగించినవాడు యోగి అనబడడు.

*గృహారణ్యాసమాలోకే గతవ్రీడా దిగమ్బరాః ।*
*చరన్తి గర్దభాశ్చైవ యోగినస్తే భవన్తి కిమ్॥*

"ఇల్లు, అరణ్యము రెంటిని సమానముగా చూచువారును సిగ్గులేనివారును, దిగంబరులుగా తిరుగువారును యోగులు అగుచో గాడిదలు కూడ యోగులు అగును, అవికూడ సిగ్గువిడచి నగ్నముగా తిరుగునుకదా!" నేను హృషీకేశమున ఉన్నప్పుడు చాలమంది యోగులు దిగంబరులై చలిలో కూర్చొనుచుండిరి. వారితో ఒక్కొక్క సాధకుడుకూడ ఉండెడివాడు. జనులు సిద్ధినిపొందిన మహాత్మునివద్ద కంబళీలు, దుప్పట్లు, పండ్లు, పూలు, మిఠాయిలు ఉంచెడివారు. కానుకలుకూడ ఇచ్చెడివారు. ఇట్టివారియందు వైరాగ్యాది సాధనములుమాత్రము కన్పించెడివి కావు. కావున వారు యోగులు అనబడరు.

*ఆజన్మమరణాన్తాశ్చ గఙ్గాదితటినీస్థితాః ।*
*మణ్డూకమత్స్యప్రముఖాః వ్రతినస్తే భవన్తి కిమ్॥*

"గంగాదినదుల తీరములయందు ఉండుటచే పవిత్రులగుచో జన్మమునుండి మృత్యుపర్యంతము గంగాతీరమున ఉండు కప్పలు, చేపలు మొదలగునవికూడ యోగులగునా?" కొందరు హరిద్వారము నుండి కాశీవరకు గంగానదీతీరమున తిరుగుదురు. త్రోవలో సదావృత్తులనుండి అడిగి తినెదరు. ఇట్టివారు నియమశీలురు అని చెప్పబడరు. దైవసంపదయొక్క గుణములను ధరించి దాని నియమములను పాలించినవారే నిజముగ నియమశీలురు.

వదన్తి హృదయానన్దం పఠన్తి శుకసారికాః ।
జనానాం పురతో దేవి విబుధాః కిం భవన్తి హి ॥

"మాట్లాడు చిలుకలును, గోరువంకలును మొదలగునవి హృదయానందమును పొందించును. కాని అవి విద్వాంసుల శ్రేణిలో చేరునా?"

ఇంటిలో పెంచిన చిలుక కూడ ప్రతిరోజు ఇంటిలోని మనుష్యులను పేరుపెట్టి పిలచును. పిల్లి వచ్చినచో కర్రతో కొట్టమని చెప్పును. కాని నిజముగా పిల్లివచ్చినప్పుడు రెక్కలు ముడుచుకొని వణకిపోవును. తన యథార్థమగు అడవి భాషలో చేం చేం అనును. అటులనే నేటిజనులు వాదవివాదములయందును, ఉపన్యాసములయందును "దేహేంద్రియాదులు అసత్యములు, విషయాదులుకూడ మాయికపదార్థములే, ధనము, భార్యాబిడ్డలు మొదలగు మాయిక పదార్థములు అన్నియును దుఃఖరూపములు, పరమాత్ముడు సుఖరూపము, అతనిని పొందవలెను" అని చెప్పెదరు. కాని వారి ధనాదులు లోపించినను, దారాపుత్రాదుల వియోగము సంభవించినను, తనకు ఇష్టులైన బంధువులలో ఎవరైన చనిపోయినను, తమ శరీరమునకు ఏదైన బాధ కలిగినను ఎంతయో బాధపడెదరు. ఇట్టివారు యోగులు అనబడరు. శాస్త్రాభ్యాసముచేసి శ్రవణ, మనన, నిది

ధ్యానములు చేసినవారును, బ్రహ్మసాక్షాత్కారమును పొందిన వారును యోగులు అనబడుదురు.

తస్మాదిత్యాదికం కర్మ లోకవఞ్చనకారకమ్ ।
మోక్షస్య కారణం సాక్షాత్తత్త్వజ్ఞానం పరేశ్వరి ॥

"పైనచెప్పిన నిరాహారాదులు అన్నియును జగమును వంచించుటకు మాత్రమే. మోక్షమునకు సాక్షాత్సాధనము తత్త్వజ్ఞానము మాత్రమే."

భక్తవరుడు:—"తమరు శ్మశానములో శవము కాలుచుండగా చూచిన వైరాగ్యము కలిగెను, అంతట తమరు ఇంటినుండి బైటకు వచ్చివేసిరి" అను సంగతి యథార్థమే కాదా? ఇప్పుడు నాకు వైరాగ్యమే లేదంటున్నారే? ఇది ఎట్లు?

స్వా. వ్రి :— అవును. అది నిజమే. వైరాగ్యము మూడు రకములు.

## వైరాగ్య భేదములు

విషయాణాం వైరస్యాద్యస్త్యాగవాన్ భవేత్ప్రవరః ।
ఉపదేశాత్స చ మధ్యః శ్మశానవైరాగ్యతో హీనః ॥

"విషయములయందలి అనిత్యత్వమును ఎరిగి వైరాగ్యమును పొందువాడు ఉత్తముడు. గురువు మొదలగువారి ఉపదేశములచే వైరాగ్యమును పొందువాడు మధ్యముడు. శ్మశానవైరాగ్యమును పొందువాడు అధముడు." పర్వతములనుండి తనయంతట తాను ప్రవహించు ప్రవాహము అఖండముగా నుండును. ఎవరైన ఒక గొయ్యి త్రవ్వి పదిపన్నెండు బిందెలు నీరు పోసినచో కొంతకాలము ఉండి తరువాత ఎండిపోవును. మరుభూమియందు నీటిప్రతీతిమాత్రమే ఉండును. యథార్థమునకు అక్కడ జలము ఉండదు. వివేకయుక్త

మగు వైరాగ్యము స్థిరముగా నిలచియుండును. ఈవిషయమున కబీరు చరిత్రమును దృష్టాంతముగా గైకోనవచ్చును:—

ఒకనాడు కబీరుప్రసిద్ధిని విని ఒకవ్యక్తి ఆయనను దర్శించుటకు వచ్చెను. ఆయన ఆసమయమున ఇంట లేకుండెను. ఆయన భార్య చెప్పెను:—

"మాబంధువులలో ఒకరు చనిపోయిరి. అంత్యక్రియలకు వారు శ్మశానమునకు వెళ్లిరి." ఆవచ్చిన వ్యక్తి అడిగెను:—

"అచ్చట ఎంతమందియో ఉందురుకదా! వారిలో కబీరుగారు ఎవరో ఎట్లు తెలియును?"

కబీరు భార్య చెప్పెను:—

"మిగిలినవారి అందరకును శ్మశానమునందు ఉన్నంతసేపును ముఖముపై వైరాగ్యచిహ్నములు ఉండును. కాని శ్మశానమునుండి బైటకువచ్చుటతోడనే ఆఔదాసీన్యము ఉండదు. వారిది శ్మశానవైరాగ్యము. కాని కబీరుగారిఒక్కరి వైరాగ్యముమాత్రము శ్మశానము విడచినతరువాతకూడ ఉండును. ఏలనన వారివైరాగ్యము వివేకముతో కూడినది."

నాది శ్మశానవైరాగ్యము. ఎండమావులవలె పైకి కన్పించునదిమాత్రమే. ఇప్పటివరకు ఆచరించలేకపోతిని.

శాఖా:— తమరు సమస్తమును ఆచరణలో చూపుచున్నారు. మేముమాత్రము ఆచరించుటకు తలచుచునే ఉన్నాము. కాని సాంసారికజీవులమగుటచే చుట్టుప్రక్కల ఉన్న వాతావరణమువలన ఆచరించుటకు ఏమాత్రమును వీలగుటలేదు. ఇక తమరే అట్లు చెప్పుచున్నచో మాస్థితి ఏమనవలెను?

స్వా. ప్ర. :—మీరు నేను ఇట్లు చెప్పుచున్నారు, కాని 5000 సంవత్సరములకు పూర్వము భగవానుడు చెప్పెను:—

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః॥

"వేలకొలదిమంది మనుష్యులలో ఒకడు సిద్ధికొరకు ప్రయత్నించును. అట్లు ప్రయత్నించినవారిలో వేయిమందిలో ఒకడు యథార్థముగా నన్ను తెలిసికొనగలడు."

ఐదువేలసంవత్సరములకు పూర్వము వేలకొలదిజనులలో ఒకడు సిద్ధికొరకు కోరువాడు ఉండును అని వ్రాయబడినది. కాని నేడు లక్షలకొలది జనులలో ఒకడుకూడ జ్ఞానమును పొందవలెనని కోరువాడు ఉండడు.

భక్త:— ఇదంతయు ఆచరించుట చాలదుర్ఘటము. ఇట్లు నేను ఆచరించగలనా?

స్వామి: శరీరనిరపేక్షస్య దక్షస్య వ్యవసాయినః।
బుద్ధిప్రారబ్ధకార్యస్య నాస్తి కించన దుష్కరమ్

"శరీరాభిమానము లేనివాడును, నిర్భయుడును, నేర్పరియును, నిత్యమును పరిశ్రమచేయువాడును, బుద్ధిచెప్పినట్లు పనిచేయువాడును అగు వ్యక్తికి దుష్కరమయినది ఏమియును లేదు."

శరీరనిరపేక్షస్య :— నేను సంసారమునుండి నివృత్తినిపొంది ఏకాంతమున కూర్చొని భజనచేసినచో నాశరీరనిర్వహణము ఎట్లు జరుగును అనుయోగక్షేమమునకు సంబంధించిన విచారముఉండరాదు.

దక్షస్య :— యోగాభ్యాసము చేయుచున్నప్పుడు అతనితపము, త్యాగము, నిష్కామము చూచి అతనియందు పూజ్యభావముచే ఆకర్షణపొంది అనేకమంది సత్కారము, గౌరవము, పూజలు, ద్రవ్యాదులు స్వీకరించవలెనని ప్రార్థించెదరు. ఆ ఆశలకు లోనుకాకుండు నేర్పరితనము కలవాడు.

వ్యవసాయినః :— ఆత్మజ్ఞానముకొరకు నిర్విరామకృషి చేయువాడు.

బుద్ధిప్రారమ్భకార్యస్య :—సత్త్వప్రధానమగు వివేకబుద్ధిద్వారా వైరాగ్యాది సాధన సంపన్నుడయి యోగసాధన చేయువాడు.

నా కించన దుష్కరమ్ :— అట్టివానికి దుష్కరమయినది ఏమియును లేదు.

జీ వే శ్వ రా ఽ ద్వై త ము.

భ క్త :—జీవుడును, ఈశ్వరుడును ఒకడే అని చెప్పెదరు. కాని వారిలో ఈశ్వరుడు సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును కూడను. జీవుడుమాత్రము అల్పజ్ఞుడు, అల్పశక్తిమంతుడు. ఇట్టి విరుద్ధలక్షణ ములుకల జీవేశ్వరులు ఒకటి అని ఎట్లు అనుకొనగలము? జీవేశ్వరులు ఒకటి అయినచో ఉపాస్యఉపాసక భావము ఎట్లు కలుగును?

స్వా. ప్రి. :—అధిష్ఠానమగు జీవేశ్వరులు ఒకటే. కాని మూలప్రకృతియగు అజ్ఞానమును మాయ, అవిద్య అని రెండు భాగములుగా గ్రహించవలెను.

మాయా చావిద్యా చ స్వయమేవ భవతి।

“మూలప్రకృతియగు అజ్ఞానమే మాయగను, అవిద్యగను రూపొందును.” అందును మాయ సత్త్వ ప్రధానము. తన ఆశ్రయ మును ఆచ్ఛాదించలేదు. తద్విశిష్టమగు చైతన్యము ఈశ్వ రుడు. ఆతడు సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును. అవిద్య తమోగుణ ప్రధానము. అది తన ఆశ్రయమును ఆచ్ఛాదించును. తద్విశిష్టమగు జీవుడు అల్పజ్ఞుడును। అల్పశక్తిమంతుడును. ఇది ఉపాధిభేదముచే కలు గును. కావున జీవేశ్వరులలో విరోధప్రతీతి కలుగును. పురుగుపై చిన్న రాయి వేసినచో చనిపోవును. ఏనుగుపై పెద్దరాయి వేసినను మర ణించదు. దానిభారమును సుఖముగా వహించగలదు. జీవాత్మ రెం డింటియందును సమానముగానున్నను శరీరోపాధియందలి భేదముచే భేదము కన్పించును. జలసృష్టిలో సముద్రమును, తరంగమును

ఒకటే అయినను సముద్రమునందు మొసళ్ళు, మత్స్యములు, ఓడలు మొదలగునవి అనేకము ఉండును. తరంగమునందు ఉపాధిభేదముచే వానికి స్థానము లేదు. ఉపాధిభేదముచే ఈశ్వరుడు పెద్దవాడు. జీవుడు చిన్నవాడు. ఈశ్వరుడు ఉపాస్యము. జీవుడు ఉపాసకుడు. తత్త్వదృష్టితో ఉభయులును ఒకటే. శంకరభగవత్పాదులు ఈవిషయమును సెలవిచ్చిరి:—

*సత్యపి భేదాపగమే నాథ! తవాహం న మామకీనస్త్వమ్।*
*సాముద్రో హి తరఙ్గః క్వచన సముద్రో న తారఙ్గః॥*

"ఓస్వామీ, భేదము లేదు. అయినను నేను నీవాడనే. నీవు నావాడవు కావు. తరంగము సముద్రమునకు సంబంధించినదే. కాని ఎట్లు చూచినను సముద్రము తరంగమునకు సంబంధించినది కాదు." తత్త్వదృష్టిని పరికించిన అన్నిటియందును ఒకటే కలదు.

ఆంజనేయులవారు నిరంతరము శ్రీరామచంద్రుని సేవించుటలో తత్పరులై యుండిరి. వారివిషయమున కొందరకు సందేహము కలిగెను. "హనుమానుడు ఎంతకాలమునుండియో శ్రీరాములవారిని సేవించుచునేయున్నాడు. అయినను ఇంకను ఆయనదాసుడే." అనుకొనిరి. శ్రీరామచంద్రులు ఈవిషయమును గ్రహించిరి. నిండు సభలో ఆయన ఆంజనేయుని ప్రశ్నించిరి. "నీస్వరూపము ఏమి?" ఆయన తలచెను. శ్రీరామచంద్రుని దాసుడను అని చెప్పినచో భగవానుని సేవచేయుచున్నాను. నేను దాసుడనుగానే ఉండిపోయినట్లు జనులు అనుకొనెదరు. "నేను బ్రహ్మమును" అనిచెప్పినచో "నీవు బ్రహ్మము అయినచో శ్రీరామచంద్రునిసేవ చేయుట ఏమి?" అని ప్రశ్నించెదరు. ఇట్లు ఆలోచించి ఆయన సమాధానము చెప్పెను:—

*దేహభావేన దాసోఽస్మి జీవభావే త్వదంశకః।*
*ఆత్మభావే త్వమేవాహమితి మే నిశ్చితా మతిః॥*

"దేహభావముచే నేను నీదాసుడను. జీవభావముతో నీఅంశమును. ఆత్మభావముతో నీవే నేను అని నాదృఢనమ్మకము."

తాత్పర్యమేమన దేహేంద్రియముల దృష్టితో తాను జగమునంతకును దాసుడు అను దాసత్వభావమును పొందుటచే గర్వము, అభిమానము, రాగద్వేషాదులు మొదలగు దోషములు నివృత్తి నిపొంది ఈశ్వరభావమును పొందుదురు. ఎవడైన క్రోధముతో నీఎదుటకు వచ్చినచో అది పరమాత్ముని నృసింహస్వరూపముగా తలచుము. ధూర్తుడు ఎవడైన వచ్చినచో అది పరమాత్ముని వామనస్వరూపముగా భావించుము. మాయగాడు ఎవడైన మాయ చేయుటకు వచ్చినచో ఆతనిని పరమాత్ముని కృష్ణరూపముగా తెలిసికొనుము. ధర్మాత్ముడు ఎవడైన వచ్చినచో అతడు సాక్షాత్తు శ్రీరామచంద్రభగవానుడని అనుకొనుము. ఇట్లు అందరను పరమాత్మునిగనే చూడుము. ఈశ్వరుడు అనేకఅవతారములు ఎత్తినట్లుగనే జగమునందు ఒకే పరమాత్మ అనేకరూపములు ధరించెను. శ్రుతికూడ చెప్పుచున్నది:—

తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్॥

"పరమాత్ముడు దానిని (కార్యరూపమగు జగమును) సృజించి దానియందే తాను జీవరూపమున ప్రవేశించెను."

ఇట్టిదృష్టిని పొందుటచే పశుపక్ష్యాది ప్రాణులన్నిటియందును మానవుడు పరమాత్ముని దర్శించును. ఈవిషయమున శ్రీమద్భాగవతమును పరికించుడు :—

*ఈశ్వరో జీవకలయా ప్రవిష్టో భగవానితి ।*
*ప్రణమేద్దణ్డవద్భూమౌ శ్వచాణ్డాలగోఖరమ్॥*

"అన్నిటియందును జగదీశ్వరుడు తన జీవకళారూపమున ప్రవేశించెను. అని తలచి కుక్క, చండాలుడు, గోవు, గాడిద అన్ని జీవులకును నమస్కరించవలెను."

ఏ ప్రాణి అయినను సరే, తుచ్ఛమైనదని తలచరాదు. తాను గొప్పవాడను అనుకొనరాదు. తాను ఎదుటవారికి ఎవరికిని నమస్కరించరాదనియును, ఇతరులు తనకు నమస్కరించవలెననియును అనుకొనరాదు. అట్టి అహంభావమును వీడి అన్నిటియందును ఈశ్వరభావమును పొంది నమస్కరించవలెను. అనగా త్రోవలో వచ్చుచు పోవుచు ఉన్నప్పుడు కన్పించిన పశుపక్ష్యాదులన్నిటికిని నమస్కరించవలెనని భావము కాదు. ఎల్లప్రాణులయందును ఈశ్వరభావమును పొందుము. ఇట్లు చేయుటచే గర్వాదులు నశించును. శత్రు, మిత్రాది విషమదృష్టి తొలగిపోవును. సర్వాత్మభావము కలుగును. ఇట్టి సర్వాత్మభావము జ్ఞానదేవునియందు ఉండెను.

జ్ఞానదేవుడు తనసోదరుడైన నివృత్తినాథునితో బ్రాహ్మణులవద్దకు వెళ్ళెను. *తాము సన్యాసి కుమారులమనియును అందుచే తమకు ఏదో రీతిని ప్రాయశ్చిత్తము చేసి, పవిత్రులజేసి యజ్ఞోపవీతధారణ చేయించుడనియును ప్రార్థించెను. సన్యాసికుమారునికి ప్రాయశ్చిత్తము అనునది లేదని బ్రాహ్మణసభ నిర్ణయముచేసి ఆవిషయము జ్ఞానదేవునకును ఆతనిసోదరునకును తెలిపిరి. సభ ముగియుసమయమున వారిలో ఒకరు ఆసోదరులిద్దరిని ఇట్లు ప్రశ్నించెను. మీ పేర్లకు అర్థములు మీకు తెలియునా? తెలిసినచో చెప్పుడు. నివృత్తినాథుడు చెప్పెను:— నాపేరు 'నివృత్తి'. ప్రవృత్తిమార్గమునకు పోకుండ స్వసుఖామృతమును అనుభవించెదను.

---

* జ్ఞానదేవుని తండ్రి విరక్తుడై సన్యాసుల గుంపులో చేరెను. కొద్దిరోజుల తర్వాత అతనికి దీక్షయిచ్చిన గురువుగారు రాగా జ్ఞానదేవునితల్లి వారికి సాష్టాంగప్రణామము చేసెను. ఆగురువుగారు ఆమెను 'పుత్రవతీ భవ' అని ఆశీర్వదించిరి. అంతట ఆమెభర్త గుర్వాజ్ఞచే తిరిగి గృహస్థాశ్రమములో ప్రవేశించగా ఆదంపతులకు జ్ఞానదేవుడు, నివృత్తినాథుడు అను ఇద్దరు కుమారులు;ముక్తాబాయి అను కుమార్తెయు జన్మించిరని కథ కలదు.

జ్ఞానదేవుడు పలికెను:—నాపేరును అనుసరించి వేదములు అన్నియును నాకు తెలియును. చిన్నపిల్లల నోటనుండి ఇంత పెద్ద మాటవిని సభాసదులు సవ్వకుండ నుండలేకపోయిరి. ఇంతలో త్రోవను పోవుచున్న ఒక దున్నపోతునుచూపించి వారు ఇట్లనిరి:— పేరులో ఏమి కలదు? ఈదున్నపోతు పేరుకూడ జ్ఞానదేవుడే.

ఇది విని జ్ఞానదేవుడు పలికెను:—నిజమే. ఈ దున్నపోతునందును, నాయందును కూడ ఉన్న ఆత్మభావమునందు ఇసుమంతయును భేదములేదు. ఆదున్నపోతుకూడ నా ఆత్మయే. అన్ని దేహములయందును ఒకే పరమాత్మ నిండియున్నది. ఎన్నికుండల నీళ్లు పెట్టినను వాని అన్నిటియందును ఒకేసూర్యుడు ప్రతిబింబించును. ఉపాధిభేదముచే భిన్నముగా కన్పించును. అయినను వివేకము కలవాడు సూర్యుని సూర్యత్వమునందే లక్ష్యమును కలిగియుండును. కారణమున దృష్టి స్థిరపడినవాడు కార్యమును చూచి కొంచెముకూడ ఆశ్చర్యపడడు. వివిధములగు స్వర్ణాలంకారములు అన్నియును స్వర్ణరూపములే. ప్రతిబింబాధిష్ఠానము బింబమే. వస్త్రము తంతురూపమయినట్లు నామరూపాత్మకమగు జగముకూడ పరమాత్మరూపమే.

చైతన్యమయుడగు జ్ఞానదేవుని దృష్టిలో తనకును దున్నపోతునకును భేదము కన్పించలేదు. జ్ఞానదేవుని అంతరంగమునగల అభేద ప్రతీతి బ్రాహ్మణులకు కలుగుటకు ఎంతయో కాలము పట్టలేదు. దున్నపోతుల కాపరి దున్నపోతు వీపుపై మూడుదెబ్బలు కొట్టెను. వెంటనే జ్ఞానదేవుని వీపుపై మూడుతట్లును లేచి వానినుండి రక్తము ప్రవహించమొదలిడెను. ఇది చూచి సభాసదులందరును ఆశ్చర్య చకితులయిరి.

ఉపాధిభేదముచే కన్పించు భేదభావము వాస్తవికము కాదు అనియే దీని భావము.

## తత్త్వోపదేశముచే జ్ఞానోపలబ్ధి.

భక్త:— అభేదజ్ఞానము ఎట్లు కలుగును? గురువుద్వారా కలుగునా? లేక శాస్త్రాభ్యాసముచే కలుగునా?

స్వా. శ్రీ:— సాంఖ్యసూత్రములు చెప్పుచున్నవి:-

రాజపురుషవత్తత్త్వోపదేశాత్ ।

"తత్త్వోపదేశముచే రాజపుత్రునకు కలిగినట్లు కలుగును."

ఒక దేశమున ఒక రాజు ఉండెను. అతనికి అన్నిసుఖములును ఉండెను. కాని సంతానము లేదు. ఎన్నియో యజ్ఞములును, దానములును చేసెను. 50, 55 సంవత్సరముల వయస్సునందు ఆతనికి కుమారుడు కలిగెను. రాజ్యమంతయును ఎంతయో ఆనందించెను రాజు గొప్పగొప్ప జ్యోతిష్కులను పిలిపించి రాజకుమారుని జాతకమును చూపించెను. జాతకమును చూచినవారిలో ఒకజ్యోతిష్కుడు ఇట్లు భయపెట్టెను:-

"ఈరాజపుత్రుడు రాజ్యములో ఉన్నచో రాజ్యమునకు ఆపత్తు కలుగును." రాజు గ్రుడ్డినమ్మకముతో రాకుమారుని మంత్రికి అప్పగించి చెప్పెను:—

"రాజకుమారుని అరణ్యములోనికి తీసికొనిపోయి వధించుము." మంత్రి ఎంతయో దయాస్వభావుడును, దూరదృష్టికలవాడును అయి యుండెను. బాలకుని తేజోవంతమగు ముఖమును, సుందరరూపమును చూచి వధకులతోపాటు తానుకూడ అరణ్యములోనికి వెళ్ళెను. ఆ మంత్రి బాలకుని అరణ్యములోనికి తీసికొనివెళ్లి భిల్లదంపతులకు అప్పగించెను. బాలకుని పెంచుటకు వలయు ఏర్పాట్లుచేసి ఆభిల్లదంపతులకు వార్షికములను నిర్ణయించెను. ఈవిషయములు రాజునకు తెలియనియ్యలేదు. రాజపుత్రుడు భిల్లునివద్దనే పెరుగుచుండెను. అతడు బాల్యమునుండియు ఎంతయో పరాక్రమవంతుడును, బుద్ధిమంతుడును

అయియుండెను. అతడు ప్రతిదినము ధనుర్బాణములు ధరించి అరణ్యమునకు పోయెడివాడు. ఈవిధముగా ఆతనికి 18, 19 సంవత్సరముల వయస్సు వచ్చెను. ఈసమయమునకు రాజుగారి వయస్సుకూడ 70, 75 సంవత్సరములు వచ్చెను. అనారోగ్యకారణమున ఆయనశరీరము చాల బలహీనమయ్యెను. అప్పుడు ఆయనకు పశ్చాత్తాపము కలిగెను "నాకుమారుడు బ్రతికి ఉన్నచో ఈ రాజ్యభారమును వహించి వార్ధక్యమున నాకు సుఖమును కలుగజేసియుండునుకదా!" అని మంత్రివద్ద వాపోయెను. మీకుమారుడు బ్రతికియున్న ఏమిచేయుదురని మంత్రి ప్రశ్నించెను. రాజు పలికెను:— "ఇట్లు జరుగుట సంభవము కాదు. నాకుమారుని నీకే వధింప నప్పగించితిని కదా!" ఇది విని మంత్రి యథార్థపరిస్థితులను వివరించి "మీకుమారుడు జీవించియున్నాడు." అని విన్నవించెను.

రాజు పరమానందముతో పుత్రుని తోడ్కొని రమ్మని మంత్రికి ఆజ్ఞాపించెను. వెంటనే మంత్రి అరణ్యములోనికి వెళ్ళి భిల్లుని పిలచి "నీకు కొన్నిసంవత్సరములకు పూర్వము అప్పగించిన రాజకుమారుడు ఎక్కడ ఉన్నాడ"ని అడిగెను. భిల్లుడు ఆరాజకుమారుని తీసికొనివచ్చి మంత్రిఎదుట నిలబెట్టెను. అశ్వారూఢులతోనున్న మంత్రిని చూచుటతోడనే రాజపుత్రుడు మిక్కిలి భయపడెను. మంత్రి ఆతనిని తనదగ్గరకు పిలచి ఇట్లనెను:—

"నీవు రాజకుమారుడవు. నీరాజ్యమునకు రమ్ము. నీతండ్రిగారు పిలువనంపిరి."

రాజకుమారుడు చెప్పెను:— 'నేను రాజకుమారుడను కాను. నేను భిల్లబాలుడను. ఎదుటనున్న ఈవ్యక్తులు నాతల్లిదండ్రులు.'

మంత్రి ఎంత తెలియజెప్పినను ఆ రాజకుమారుడు నమ్మలేదు. చివరకు "ఈమె నాతల్లి. ఈమెచెప్పిన నమ్ముదును." అని రాకుమా

రుడు పలికెను. అంతట భిల్లవనిత జరిగిన సంగతులన్నియును విశదీకరించెను. రాజకుమారుడు యథార్థమని విశ్వసించి మంత్రితో బయలుదేరెను. మంత్రి ఆతనిని రాజునొద్దకు తీసికొనివెళ్ళి చెప్పెను.

"నేను ఎంత చెప్పినను నితనికి నమ్మకము కలుగలేదు. తల్లి చెప్పిన మాటలను నమ్మి ఇతడు ఇక్కడకు వచ్చెను.

ఒక్కమారుగా రాజు ఆతనిని కౌగలించుకొనుటకు ముందుకు వచ్చెను. కాని రాజకుమారుడు సంకోచించెను. ఆతనికి మంత్రి ఎంత చెప్పినను తాను భిల్లుడను అను భావమే ఆతనిని వేధించుచుండెను. అంతట మంత్రి ఇట్లు వివరించెను. మీఉభయుల శరీరము ఒకటే. భిల్లులు నల్లగ కురూపులుగ నుందురు. భిల్లులతో నిత్యము సంచరించుచు, ఎండలో తిరుగుచున్నను నీశరీరవర్ణము తెల్లగనే ఉన్నది. భిల్లుల శరీరమువలె నల్లగ లేదు. అనంతరము అద్దములో రాకుమారునకు ఆతని స్వరూపమును చూపించెను. అంతట రాజకుమారునకు పూర్ణానుభవము కలిగెను.

*సంవర్ధితో రాజపుత్రో వనే భిల్లేన కేనచిత్ ।*
*న త్వం భిల్లో రాజపుత్ర ఇత్యాప్తేన ప్రబోధితః*

"వనమునందు భిల్లునిచే పెంచబడిన రాజపుత్రుడు నీవు భిల్లుడవు కావు, రాజపుత్రుడవు" అని ఆప్తజనునిచే ప్రబోధించబడెను."

ఇటులనే మంత్రివంటి గురువును, భిల్లమాతవంటి శ్రుతియును రెండును కావలెను. గురువుద్వారా శ్రుతిని శ్రవణముచేసి, మనననిదిధ్యాసములు చేయుటచే రాకుమారునకు అనుభవము కలిగినట్లుగా తనకు అభేదజ్ఞానము కలుగును.

భక్త:—ఖాళీగా కూర్చొనినచో మనస్సు అటునిటు పరుగెత్తదు. కాని మాలాదులు తీసికొని జపించుచున్నప్పుడు మనస్సు ఎక్కువగా పరుగెత్తును. కారణమేమి?

స్వా. ప. :— ఈవిషయమున ఒక దృష్టాంతము కలదు.

ఒక బ్రాహ్మణుడు కలడు. అతనికి ఒక ఆవు ఒకదూడ ఉండెను. ఆదూడ పెద్దదైన తరువాత ఆబ్రాహ్మణుడు ఒకగొల్లనుపిలచి ఆఆవు దూడను అరణ్యమునందు విడచెను. అక్కడ ఆదూడ చూడుకొనెను. ఇదితెలిసికొని బ్రాహ్మణుడు ఆవుదూడనుతీసికొనివచ్చుటకు గొల్లతో అరణ్యమునకు వెళ్ళెను. కాని ఆదూడ రాలేదు. బ్రాహ్మణుడు ఎంత శ్రమపడినను ఆవుదూడ అతనితో రాలేదు మెడలో త్రాడు కట్టి లాగినను రాలేదు. అంతట తెలివిని ఉపయోగించి మెత్తని లేతపచ్చ గడ్డిని చూపించగా గడ్డి తినవలెనను కోరికతో అతనివెంట నడచెను. బ్రాహ్మణుడు ఇంటికి తీసికొనివచ్చి దానికి తెలికపిండి మొదలగునవి తినిపించెను. దానిరుచి తెలిసియుండుటచే తిని మరల అరణ్యమునకు బయలుదేరెను. తిరిగి గడ్డి, తెలకపిండి చూపించగా బ్రాహ్మణుని ఇంటికి వచ్చి తిరిగి అరణ్యమునకు పోవుచుండెను, ఒకసారి బ్రాహ్మణుని యింట ఉండగా ఈని దూడను కనుట సంభవించెను. దానితో ఆఆవుకూడ ప్రేమపాశమునకు కట్టువడిపోయెను. ఇక అది ఇంటనే ఉండి పోయెను. కర్రతో కొట్టినను బైటికి పోలేదు. తాత్పర్యమేమనః— ఆవరణభంగమయి జ్ఞానమను కుమారుడు కలిగినంతనే వృత్తి అంతర్ముఖమయి మనశ్చాంచల్యము నశించును.

## ఏకాంత మాహాత్మ్యము.

తదుపరి భక్తవరుడు ప్రశ్నించెను:— నేను చాలరోజులనుండి భార్యను కోల్పోయిఉన్నాను. నాకు వేరొక ఉపాధికూడ లేదు. ఏకాంతమునందుండి అభ్యాసము చేయవలెనని నాఉద్దేశ్యము.

స్వా. ప. :— ఇది చాల మంచితలంపు. ఇంతవరకును మహాత్ములయినవారు అందరును ఏకాంతమున ఉండియే కార్యసిద్ధిని పొందిరి. ఏకాంతమును గురించి పారసభాగమున వివరించబడినది:— ఏకాంతమునందు ఆరు లాభములు కలవు.

1. భజన అన ఆలోచనాసిద్ధి. చిత్తైకాగ్రత ఏకాంతమున కలుగును. చిత్తవృత్తిని భగవానునియందు లీనముచేసి పదార్థములను అన్నిటిని విస్మరించుట అనునది ఏకాంతమునకాని జరుగదు. ఏలనన మాయాపదార్థములు అన్నియును జీవుని బంధనమున చిక్కువడునట్లు చేయును. ఎంతయో భాగ్యశాలియగు జిజ్ఞాసువునకే సంసారముతో నిర్లిప్తుడుగానుండు శక్తి కలుగును. మహాపురుషులు ఆరంభావస్థయందు పర్వతగుహాలయందు నివసించెడివారు. పూర్ణావస్థను పొందిన తరువాత శరీరవ్యాపారమును పూర్తిచేయుటకుమాత్రమే జగముతో సంబంధము కల్పించుకొనెడివారు. ఇక వారి చిత్తమును భగవద్భజనమునందే సంలగ్నముచేసెడివారు. భగవత్ప్రీతి జగత్ప్రీతినుండి సంతునికి విరక్తి కలిగించునని మహాపురుషులు చెప్పుదురు. ఒకసంతు చెప్పెను– "నేను ముప్పది సంవత్సరములనుండి భగవంతునితో మాట్లాడుచున్నాను. కాని తమతో మాట్లాడుచున్నానని ఈజగమునందలి జనులు అనుకొనుచున్నారు." ఇట్టిది అసంభవము కాదు. ఏపదార్థమునందైన మిక్కిలి ప్రేమ కలిగినచో జనసమూహమునందు కూర్చొనినను వారిమాటలను వినము. వారిని చూడముకూడను. అయినను ఈదశనుపొంది గర్వించరాదు. చాలమంది జనసంపర్కముచే పాడగుదురు.

ఒక తపశ్శాలి కలడు. ఆయనను జనులు ప్రశ్నించిరి:– స్వామీ! తమరు ఒంటరిగా ఎందుకు ఉండుచున్నారు? ఆయన సమాధానము చెప్పెను:– "నేను ఒంటరిగా లేను. నాతో భగవానుడు ఉన్నాడు."

ఏకాంతమున ఉన్న మరియొక సంతునికూడ ఇట్లే ప్రశ్నించగా ఆతడు ఇట్లు చెప్పెను:– నేను నాకర్తవ్యమున పొందిన నిమగ్నతవలన ఇతరులను కలియనైననెడి కోరికకూడ నాకు కలుగదు

ఆకర్తవ్యము ఏమి అని వారు ప్రశ్నించిరి. ఆతడు ఇట్లు సమాధానము చెప్పెను:—అనుక్షణము భగవానుడు నాకు చేయు ఉపకారములసంఖ్య పెరుగుచున్నది. నాపాపములను క్షమించమని ప్రార్థించుటలో నాసమయము వ్యయమగుచున్నది. ఇతరులను కలసికొనుటకు అవకాశము ఉండుటలేదు. ఇట్టి సంతులు ధన్యులు కదా!

ఒక జిజ్ఞాసువు మరియొకసంతువద్దకు వెళ్ళెను:—

"నీవు ఎందుకు ఇచ్చటకు వచ్చితివి?" అని ఆయన ప్రశ్నించెను.

జిజ్ఞాసువు జవాబు చెప్పెను:—

తమసాంగత్యమున విశ్రాంతిని పొందుటకు వచ్చితిని.

సంతు చెప్పెను:—

"భగవంతుడు లభించినవాడు విశ్రాంతికొరకు మరి ఏచోటికి వెళ్ళవలెను?"

మరియొక సంతు పలికెను:—

"రాత్రిఅయిన నాకు ఆనందము కలుగును. ఏలనన ప్రభాతము అగువరకును ఏకాంతమున భగవద్భజనము చేయుచు ఉండవచ్చును. సూర్యోదయము అయినంతనే జనులు విక్షేపము కలుగజేయుదురను బాధ కలుగును."

మరియొక సంతు చెప్పెను:—

"జనులతో వాదవివాదములను చేయవలె ననుకొనువారు మూర్ఖులు. వారిహృదయము మాలిన్యమును పొందును. ఆయువు వ్యర్థమగును."

ఒక బుద్ధిమంతుడు చెప్పెను:—

"ఏమనుష్యుని అయినను కలసికొనవలెనను కోరిక కలిగినచో వారి హృదయమున ఆత్మసుఖమును పొందుకోరిక లేదని తెలిసికొనవలెను. కావుననే స్థూల పదార్థములను కోరును. జనులను కలసికొనగోరువాడు కడుబీద వాడు."

ఈదృష్టాంతములబట్టి ఉత్తమమగుభజన హృదయమునందలి అభ్యాసము అని తెలుచున్నది. అభ్యాసముచేతనే భజనరహస్యము తెలియనగును. ఆలోచనాశక్తియు, జ్ఞానమును కలుగును. ఇవియే సాధనమునకు మూలము. ఈ అభ్యాసము ఏకాంతమునందుతప్ప మరియొకవిధముగా జరుగదు. ఏకాంతముచే అనేక పాపములనుండి విముక్తుల మగుదుము. జనుల సాంగత్యమున చేరు నాలుగు రకముల పాపములనుండి తప్పించుకొనగలుగువారు చాలతక్కువమంది కలరు.

1. నింద. ఇది మొదటిపాపము. దీనిచే ధర్మభ్రష్టులగుదురు.

2. ఇతరులు అపకృత్యములు చేయుచుండగా చూచి ఉపదేశించకుండుట. దీనిచే సాధకుడు శాస్త్రములవిధినుండి విముఖత్వమును పొందును. ఒకవేళ ఉపదేశించినను ఆఉపదేశమును వినను ద్దేశ్యము వ్యక్తికి లేనిచో ఆతనితో విరోధము కలుగును.

3. దంభము:—ఎవరైన కలసికొనుటకు వచ్చినచో "మిమ్ము కలసికొనవలెనని చిరకాలమునుండి అభిలాషగా నున్నది. అది నేడు ఈడేరినది. మీబంధువులు అంతా క్షేమమా?..." ఇట్లు మాట్లాడెదరు. హృదయమున ఆతనియందు కాని ఆతనిబంధువులయందు కాని ప్రేమ ఉన్నను లేకపోయినను ఆవిధముగా మాట్లాడుట దాంభికప్రవర్తనగా నెరుగవలెను.

ఒక వ్యక్తి ఒకసంతువద్దకు వెళ్ళెను. సంతు ఆయనరాకకు కారణము అడిగెను. "తమదర్శనము చేయవలెనను ప్రేమతో వచ్చితిని" అని అతడు చెప్పెను.

సంతు చెప్పెను:—నీవు నాయందలి ప్రేమతో రాలేదు. ప్రేమను పోగొట్టుకొనుటకు వచ్చితివి. ఏలనన నీవు నాస్తుతి తగినంతగనే చేయలేదు. మితిమీరి నన్ను స్తుతించి నీగొప్పతనమును ప్రకటించితివి. కావున మనము ఇరువురము దంభముచే పాషండులము

అయితిమి. అందుచే ప్రేమ శాశ్వతముగా నిలువదు. కావున ప్రేమ కలవారు ఒకరినొకరు కుశలప్రశ్నలు వేసికొనరు. కొన్ని సమయములలో వేసిన కుశలప్రశ్నలకు సంతులు చెప్పు సమాధానములు వినుడు.

1. సుఖముగాను ఆనందముగాను ఉన్నాము.

2. పొందవలసిన పదవి పొందుశక్తి నాచేతిలో లేదు. దుః. దాయకములగు కర్మములనుండి నివృత్తిని పొందుటకూడ నాచేతిలో లేదు. నేను నా యోగక్షేమములను భగవానుని చేతిలో ఉన్నవని తెలిసికొంటిని. కావున నావంటిదుఃఖితుడు, అనాథుడును ఎవడును లేడు.

3. నేను పాపాత్ముడను. దుర్బలుడను. ప్రారబ్ధమును అనుభవించుచున్నాను.

4. నరకదుఃఖమునుండి నిర్భయుడను అయినచో నిజముగ సుఖము కలుగును.

5. ఉదయమున లేచినచో సాయంకాలమువరకును జీవించునో, జీవించడో తెలియనివానిసంగతి ఏమని చెప్పుదును?

6. ఆయువును, బలమును తగ్గుచు, పాపము పెరుగుచు ఉండువానిసంగతి ఏమని చెప్పుదును?

7. ప్రభువు ఇచ్చినది తినుచున్నాను. మనస్సు ఇచ్చిన ఆజ్ఞలను పాటించుచున్నాను.

8. ఆయుర్దాయము, బలము అనుక్షణము తగ్గిపోవుచున్నవి. అయినను పెద్దవాడను అగుచున్నానని తలచుచున్నాను. అట్టివాని సంగతి ఏమని చెప్పుదును?

9. మరణమే తప్పనిసరియును పరలోకమున దండనపొందుటకే పాత్రుడు అయినవానినిగురించి ఏమి చెప్పుదును?

10. పాపము చేయనిరోజున పరమసుఖమును పొందుదును. జీవితమునందు అట్టిరోజు ఒకటి లభించినను అది నా మహాభాగ్యముగా తలచెదను.

11. దూరదేశము వెళ్ళవలెను. దగ్గర దిసబత్తెము లేదు. మార్గము మహాభయంకరమైనది. కూడనెవరును లేరు. వెళ్లునది న్యాయాధికారివద్దకు. తప్పించువాడు ఎవడును లేడు. అట్టివాని దుర్దశ ఏమని చెప్పగలము?

4 వ పాపము:— మనము ఎవరిసాంగత్యము చేయుదుమో వారిస్వభావము మనయందు దృఢముగా నాటుకొనిపోవును. ఆసంగతి మనకు తెలియదుకూడను. ఆకారణముచే ఆస్వభావము పెరిగిపోవును. మహాపురుషుని సాంగత్యముచే హృదయము కోమలమయినట్లుగనే భోగలాలసుని సాంగత్యముచే హృదయమునందు భోగములయందు అభిరుచి కలుగును. కమ్మరి కొలిమిదగ్గర కూర్చొనినచో బట్టలు నల్లపడిపోవునట్లు దుస్సాంగత్యపరిణామముకూడ అయోగ్యముగా ఉండకతప్పదు. సాత్త్వికపురుషునిసంగతి అత్తరుదుకాణమువంటిది. ఎవరిసాంగత్యముచే మాయయందలి ప్రేమ పోయి భగవత్ప్రీతి కలుగునో వారిని ఉత్తములుగా తలచుము. వారిని ఎప్పుడును త్యజించకుము. కాని విద్వాంసుడైనను, అతనికృత్యములు మాటలను అనుసరించి ఉండకపోయినచో అతనిని తప్పక త్యజించుము. జనసమూహమున ఇట్టి భయములు ఉండును.

ఏకాంతమున నుండుటచే సంసారమునందలి ఈర్ష్య, ద్వేషము, సంప్రదాయవిరోధము, మొదలగు విఘ్నములనుండి తప్పించుకొనవచ్చును. ఉపాధినుండి ముక్తిని పొందనగును. అందరును తనను గురించి ఎట్టిఆశలును పెట్టుకొనరు. తాను ఇతరులనుండి ఎట్టిఆశలును కలిగియుండడు. ఆశ దుఃఖములన్నిటికిని మూలము. ఆశారహితుడవ

వలెననిన ఏకాంతము ఉత్తమప్రదేశము. ఏకాంతముననుండుటచే మూర్ఖులు, పాపాత్ములు అగువారి సాంగత్యమునుండి విముక్తులగుదురు.

## సాంగత్యముచే కలుగు లాభములు.

పరమార్థము ఏకాంతమున లభించదు. సాంగత్యముచేతనే లభించును. సాంగత్యముచే ప్రథమమున విద్యాలాభము కలుగును. కావున యథార్థమగు విద్య లభించువరకును ఏకాంతముచే ప్రయోజనములేదు. విద్యను పొందకుండ ఏకాంతమున నున్నవాడు నిద్రయందును, వ్యర్థమగు ఆలోచనలయందును తనసమయమును వ్యయము చేయును. ఆతడు భజనయందు నిమగ్నుడయినను యథార్థజ్ఞానము కలుగనిదే భజన అభ్యసించబడదు. భగవంతుని తెలిసికొనుట ఎట్లో ఎరుగలేదు. ఏవేవియో కొన్ని విపరీత నిర్ణయములను చేసికొని భగవానుని సమ్ముఖమునకు చేరుటకు బదులుగా విముఖుడయి కుమార్గమును పట్టును. రోగి వైద్యుని సాంగత్యమును విడచుట హితకరము కానట్లుగనే జీవునిబుద్ధి విద్యను పొందనిదే వ్యాధిగ్రస్తమగును. అట్టివాని ఏకాంతము ఫలించదు. యథార్థమగు విద్యను తెలిసికొని, ఆవిధమగు కృత్యములనుచేసి, అట్టి ఉపదేశములను చేయువాడు మహోత్తముడు. ఉపదేశమును తీసికొనుటయును, ఇచ్చుటయును ఏకాంతమున జరుగదు.

2. సాంగత్యముచే ఇతరులను సంతోషపరుచవచ్చును. ఏకాంతమున ఎట్టిసేవయును చేయలేము.

3. సాంగత్యముచే సహనము మొదలగు గుణములు కలుగును.

4. అనేకవిధములగు సందేహములును సంకల్పములును పోవును.

5. అన్యోన్యము ప్రేమయును వృద్ధిపొందును.

6. జనసమూహముచేతను, వారితో కలసి ప్రవర్తించుట చేతను నిరభిమానము వినయమును పుట్టును. ఏకాంతమున ఇంతకు విపరీతములగు భావములు పుట్టును. కొందరు ప్రభువృత్తిచే ఏకాంతమును సేవింతురు. ఎల్లరును వారిదర్శనమునకు వచ్చెదరని వారి ఆశయము.

ఒకనగరమున ఒకబుద్ధిమంతుడు ఉండెను. ఆతడు ఎన్నియో గ్రంథములు రచించెను. అంతటితో తాను భగవత్సామీప్యమును పొందెనని ఆతడు తలచెను అప్పుడు ఆయనకు ఆకాశవాణి వినవచ్చెను:—

"నీవు నిన్ను జగమున ప్రకటించుకొంటివి. ఇట్టి గొప్పతనము నాకు ఇష్టములేదు." ఇది విని ఆతడు సర్వమును త్యజించి ఏకాంతమును సేవించుచు ఇక దేవుడు తనయందు ప్రసన్నుడయ్యెనని అనుకొనుచుండెను మరల ఆతనికి ఆకాశవాణి వినవచ్చెను:—"ఇంకను నేను నీయందు ప్రసన్నుడను కాను. నీవు గొప్పవాడ ననుకొనుచున్నావు." అంతటినుండి ఆతడు ఏకాంతమును త్యజించి జనసమూహమునందుండి యథార్థముగా వ్యవహరించెను. అభిమానరహితుడయి సమభావముతో నుండెను. అప్పుడు ఆతనికి ఆకాశవాణి వినవచ్చెను—

"ఇప్పుడు నేను నీపట్ల ప్రసన్నుడను అయితిని."

జనసమూహమునందు ఉండుటచే గౌరవము తగ్గిపోవును విద్యయందును, కృత్యములయందును ఎవరైన ఛిద్రములు చూచెదరేమో ననుభయముతో ఏకాంతము అనెడు తెరతో దానిని కప్పగోరును. జనులు ప్రతిదినము తనదర్శనమునకు వచ్చి, తనకు సాష్టాంగదండ ప్రణామములు చేయవలెనని ఆశించును. ఈవిధమగు ఏకాంతము దంభము మాత్రమే. ఏకాంతమునందుండు వ్యక్తి ఎప్పుడును భజనము, తత్త్వవిచారము— వీనిని మరువరాదు. జిజ్ఞాసువు ఈ రెండురకముల స్థితులను పొందనంతవరకును యథార్థభేదమును తెలిసికొనలేదు.

"జగమంతయును నశ్వరము అను జ్ఞానము ప్రథమమున కలుగవలెను. తరువాత జగము తనను ఏమనినను బాధకలుగని మన స్సును పొందవలెను. అటులనే మానావమానముల భయము ఇంచు కంతయును ఉండరాదు. అట్టినరుడే ముక్తుడు.

తన అధికారమును గమనించి అధికారము ననుసరించి ప్రవ ర్తించవలెను. ఏకాంతమున నుండు తన కర్మచేతను వాక్కుచేతను ఎవరికిని ఖేదము కలుగరాదని తలచవలెను. అటులనే జగత్తుయొక్క ఉపాధిచే తనకు దుఃఖము కలుగరాదనియును భావించి అన్నివిధము లగు చిక్కులనుండియు బయటపడి భగవద్భజనమునందు అవధాన మును కలిగియుండవలెను. ఇట్టి నిశ్చయము కలిగినవానికి సర్వసంక ల్పనిరోధమును కలుగజేయునది ఏకాంతమే. ఏకాంతమున ఉండు వారు ఆహారవస్త్రాదిసంయమమును పాటించవలెను. ఎవడైన తన కృత్యములచేతను, వాక్కులచేతను దుఃఖము కలుగజేసినను అతనిని క్షమించవలెను. తన నిందాస్తుతులపట్ల లక్ష్యమును ఉంచరాదు. ధర్మకార్యములయందు అవధానమును నిలిపి తన ఉత్తమకార్యమును సిద్ధింపజేసికొనవలెను.

ఇంతలో పీరడియా అను గ్రామమునుండి కొంతమంది రైతులు స్వామివారి దర్శనార్థము ఏతెంచిరి. ప్రసంగవశమున వారు పలికిరి:— నాలుగైదురోజులకు పూర్వము ఈ పరిసరములకు ఒక అవధూత వచ్చిరి. వారు పంచాగ్నిమధ్యమున తపము చేయుదురు. గంజాయి మిక్కుటముగా త్రాగుదురు. అచ్చటికి ఎవరైన సాధువులు వచ్చిన వారిని ప్రశ్నించును:— నీమతము పేరేమి? నీవు గంజాయి త్రాగు నప్పుడు ఉచ్చరించు మంత్రమేది? నీకు ఆమంత్రము వచ్చునా? ఈ మంత్రము వచ్చునా? అని ప్రశ్నించును. సాధువులు సమాధానము చెప్పలేకపోయినచో వేళాకోళముచేయును. గంజాయిత్రాగుటకు అల

పాటుపడిన వారు అనేకులు అచ్చటికిచేరి, స్వామీ! గంజాయి త్రాగు టవలన ప్రయోజనము ఏమి అని వారిని ప్రశ్నించిరి. ఆయన ఇట్లు సమాధానము చెప్పెను.

"గంజాయి త్రాగనిదే భగవద్ధ్యానము ఎట్లు చేయనగును? భగవానుడగు శంకరుడుకూడ గంజాయి త్రాగి యోగాభ్యాసముచేసి యోగసిద్ధిని పొందెను." ఈవిధముగా ఆయన గంజాయిని సమర్థించెను.

స్వా. ని:— ఈ విషయమున "అనుభవప్రకాశము"నందు ఒక కథ కలదు.

పరాశరుడు:— నేను నీవు లేనిచోట హృషీకేశుడగు గోవిం దుడు ఉన్నాడు. ఈవిషయమున ఒక కథ వినుడు:—

## దంభముతోకూడిన వైరాగ్యమును, తపమును.

ఒకప్పుడు సంతులమగు మేము అందరము కలసి ఒకమార్గ మున పోవుచుంటిమి. ఆమార్గమున పంచాగ్నితప్తుడగు ఒక తపశ్శాలి కన్పించెను. ఆయనను చూచి మేము స్వాభావికముగా ఆయనవద్దకు వెళ్ళితిమి. తపశ్శాలి అడిగెను:— ఓసంతులారా! మీరు ఎవరు? ఎచ్చటినుండి వచ్చుచున్నారు? ఎక్కడికి వెళ్ళుచున్నారు?

జడభరతుడు చెప్పెను:— నీవు ఇప్పుడు ఉన్నట్లుగనే ఎల్లకాల ములయందును అగ్నిలో కాలుచునే యుండుము. వ్యర్థముగా మమ్ము అడుగుటచే నీకు ఏమి ప్రయోజనము సిద్ధించినది? కాని గోవిందుని భక్తి లేనిదే కర్మము లన్నియును వ్యర్థము. కావున గోవిందుని భజిం చుము. దానిచే ద్వైతమాలిన్యము తొలగును. భజన చేయకుండ పీల్చు శ్వాస నిరర్థకము అని తెలిసికొనుము. మాంసపుముద్దవంటి జిహ్వ భజనముచేయనిదే వ్యర్థముగా నోటిలో నుంచుకొనదగదు. వ్యర్థమగు మూర్ఖప్రలాపములకొరకు జిహ్వ సృజించబడలేదు. నోటితో భజనచేయుచు పాపములయందు మనస్సు సంచరించు

చున్నచో మేలు ఎట్లు అగును? భజన మానవకళ్యాణమునకు సంబంధించినది. ఇందు ప్రారబ్ధమును అంగీకరించవలెను. ధనసంపాదనమునందు పురుషార్థమును గమనించవలెను. శరీరము మృత్యువునోటపడును. అయినను మానవుడు కామముతో కూడిన జీవితమును గడుపుచున్నాడు. శరీరపాతమునకు పూర్వమే మానవుడు తనకళ్యాణమును పొందవలెను. మృత్యువు సమీపించినకొలదియు ఏమిచేయుటకును శక్తి ఉండదు. ఈసంగతి మానవుడు ఎరుగడు. నీవు తపస్వానిసి అని అనుకొనుచున్నావు. అది వ్యర్థము. నీఅహంకారమును త్యజించుము.

తప:— తమరిని కలియుటతోడనే అహంకారము శమించినది. అగ్నిసాంగత్యముచే కట్టెకు తనరూపము ఉండదు. అగ్నిరూపమే ఉండును.

జడభరతుడు :—కర్మలను అన్నిటిని జ్వలింపజేసి నైష్కర్మ్యము అను భస్మమును శరీరమునకు పట్టించుకొనువాడు తపశ్శాలి. నీవు దేనినైనా భస్మము చేసితివా?

తప :—చెప్పువివేకము లేదు. అంతేకాదు. త్యజించవగిన పదార్థములు ఏవియో గ్రహించదగినవి ఏవియో నాకు తెలియనే తెలియవు.

జడభరుతుడు:—ఓ తపశ్శాలీ! దుఃఖదాయకములగు పదార్థములను జనుడు త్యజించును. సుఖమును కలుగజేయు వానిని స్వీకరించును. విషయేంద్రియసంబంధము సంయోగవియోగములయందు సుఖదుఃఖములను గ్రహింపజేయు మనోరూపమగు అహంకారము అజ్ఞానులగు జీవులను అందరను బాధించును. దుఃఖమును కలుగజేయు ఆ అహంకారమును నీవు ఇంతవరకును త్యజించలేవు. అంతేకాకుండ అందరికంటెను ఎక్కువ అహంకారమును నీవు పొందియున్నావు. ప్రపంచమునకు భజనకాని, తపనుకాని ఏమియును తెలియదు. మీవంటి తపశ్శాలురు ఇట్లు భావించుచురు:—

"మేము గురువుగారు నేర్పిన భజనచేయు మహాతపశ్శాలురము. పంచాగ్నితప్తులము. మామహాగురువులు 84 అగ్నులను జ్వలింపజేయుదురు. మహాపండితులు, సిద్ధులు, వైద్యమునందు నేర్పరి. నా అన్నకుమారుడు నాశిష్యుడు. అతడు ముళ్ళపై పరుండును. నాలుగుసార్లు పూర్ణయాత్రలను సేవించి వచ్చెను. రోజంతయును పారాయణచేయుచుండును. మేము పాత్రము, ఆసనము, మాల-వీనిని గ్రహించునప్పుడు, మల, మూత్రములను విసర్జించునప్పుడును ఉపయోగించవలసిన మంత్రములను తెలిసికొంటిమి. మాగురువులు రాజపూజ్యులు కూడను. మేము ఒకశేరు గంజాయి ఒకజాములో పీల్చివేసినను, ఉమ్మెత్తగింజలు మొదలగునవి తినినను మాకు ఏమియును అపకారము జరుగదు. ఎవరైన సాధువులు కన్పించినచో ఈప్రశ్నలు అడుగవలెను.

నీ ఊరు ఏమి? పేరు ఏమి? సంప్రదాయము ఏమి? ఫలానపూజచేయుటకు వలయు మంత్రము ఏమి? ఆనపకాయ బుర్రను ఉపయోగించు మంత్రము ఏమి? జోలిమంత్రము ఏమి? మీామహాగురువుల పేరు ఏమి?

ఈప్రశ్నలు అన్నిటికని సంతృప్తికరమగు సమాధానము చెప్పినచో వాడు ఎంతహీనశ్రేణికి చెందినను సాధువులపంక్తిలోకూర్చొను అధికారమును పొందుచున్నాడు. అసలు చెప్పకపోయినను, ఏవైన కొన్ని చెప్పలేకపోయినను, గురువు లేనివాడును అయినను సాధువులలో లెక్కించబడడు. మంత్రములు తెలియని ఆతని ఆనపకాయ బుర్రయు జోలియును లాగికొనవలెను. మరియొక వేషముతో విద్వాంసుడు ఎవరైన వచ్చినను వానికి ప్రేమతో భోజనాదులు సమర్పించరాదు. అన్నము పెట్టుటకుకూడ సందేహించవలెను. ఆతడు అన్యసంప్రదాయమునకు చెందినవాడగుటచే పంక్తిబాహ్యుడు. గృహస్థుడు ఎవడైన కళ్యాణముకొరకు శరణుజొచ్చినచో ఆతనికి బంధనకారణమగు

అనాత్మ ధర్మమునంతను ఉపదేశించవలెను. ఆతనిని గోసంరక్షణము నందును, భాండారరక్షణమునందును వినియోగించవలెను. అతిఉత్తము డగు అధికారిని పూజయందు నియోగించవలెను. గురుశిష్యులపరం పరను తెలిసికొని, అదియే పరమధర్మముగా భావించి ఎల్లరకును నేర్ప వలెను. మహాఖిళభక్తియే సమస్తమును అని ఈతవశ్శాలురు చెప్పు చున్నారు. కాని వీరు భక్తియొక్క యథార్థస్వరూపమును నిశ్చ యించలేరు. ప్రాతఃకాలముననే లేచి అఖండవిభూతిని ధరించి ఎంత ధన మును నిలవచేసినను తప్పులేను అందురు. నిరహంకారులయి సత్సంగ ప్రభావముచే స్వరూపమును తెలుసుకొనువారు ఎక్కడో ఉందురు. కావున ఓతపోనిష్ఠుడా! ఈమిథ్యాదేహాభిమానమును త్యజించి సార మగు పదార్థమును తెలిసికొనుము. "నేను జ్ఞానిని" అను అహంభావ మును త్యజించుము. ఇక మిగులునది అవాచ్యమగుపదముమాత్రమే; అదియే పరమభక్తి. చూడదలచినచో జ్ఞానులనుఅడిగి తెలిసికొనుము, చూడదలచినచో వేదమును శోధించుము. లేదా స్వానుభవమున విచారించి గ్రహించుము. ఇక నీకు ఎట్లుతోచిన అట్లుచేయుము." అని పలికి జడభరతుడు మౌనమును వహించెను.

స్వా. ప్ర. :—పూర్వము మందవైరాగ్యము కలవారు అయి ఉండిరి. వారు మహాపురుషుల ఉపదేశములను వినకున్నను వినుచుండిరి. కాని ఈనాటిజనులకు మందవైరాగ్యముకూడ లేదు. ఇట్టివారికి స్వయ ముగా బ్రహ్మదేవుడు వచ్చిచెప్పినను తెలియదు. ఇట్టివారు ప్రజలను మోసగించుటకుమాత్రమే ఇంటినుండి బయటకు వచ్చెదరు.

ఇది విని రాజుగారు చెప్పిరి.

నేను చిన్నవాడనుగా నున్నప్పుడు సాధువులగుంపులు ఇక్క డకే వచ్చెడివారు. వారికి స్వయంపాకము మొదలగునవి నేను పంపెడి

వాడను. వారికి గంజాయి మొదలగు వస్తువులుకూడ ఇచ్చెడివాడను. సాధువులు గంజాయి త్రాగి భజనచేయుదురనియు కావున వారికి గంజాయి ఇచ్చుట మాధర్మమనియు మాపెద్దలు చెప్పెడివారు.

స్వా. శంకరానందజీ:—(వినోదార్థము) ఇప్పటివారికి తెలివి లేదు. మాగురువుగారు ఒకగుక్కలో చిలుము అంతా పట్టేసేవారని చెప్తూచుండెడివారు. (ఇది విని అందరును నవ్విరి)

స్వా. ప్రి. :—మోహాము అను మద్యమును పానముచేసి ప్రతిప్రాణియు స్పృహతప్పియే ఉన్నాడు. దానిపైన ఈ భంగు గంజాయి వంటి మాదకద్రవ్యములను సేవించి ఇంకను మత్తును పొందినచో పూర్తిగా స్పృహతప్పిపోవును. గంజాయి త్రాగి మతిపోగొట్టుకొనిన సాధువులను అనేకులను చూచితిని. పూర్వము వారు చెప్పిన ప్రకారము రాజులును, శ్రీమంతులును తమ సర్వస్వమును త్యజించి సన్యసించెడివారు. వారిలో జగడములు ఉండెడివికావు. కాని ఈనాడు ఆపద్ధతి లేదు. తిండిలేకపోయినచో సన్యాసము తిండికి ఆధారము అగుచున్నది. ఇక జగడములు ఎందుకు ఉండవు?

రాజుగారు:—సన్యాసము స్వీకరించినతరువాత జగడము ఆడుటకు కల కారణమేమి?

## దృష్టి మూడు రకములు.

స్వా. ప్రి. :—దృష్టి మూడురకములు. శ్వానదృష్టి, బాలదృష్టి, పురుషదృష్టి. కుక్క తనప్రతిబింబమును జలమునందు చూచి వేరొక కుక్క అని తలచి దానిని శత్రువుగా భావించి ద్వేషబుద్ధితో దానితో పోట్లాడుటకును, మొరుగుటకును ఉంకించును. ఇది శ్వానదృష్టి.

బాలదృష్టి:— బాలుడు అద్దమునందు తన ప్రతిబింబమును గాంచి అది తానుగా భావించి అజ్ఞానముచే ఆశ్చర్యమును పొందును. అది బాలదృష్టి.

పురుషదృష్టి:— పురుషుడు అద్దమునందు అనేక ఆడంబరములతో తనముఖాలను చూచి అవి అన్నియును నేనే అని భావించును.

శ్వానదృష్టియందు అజ్ఞానులు శత్రుత్వ, మిత్రత్వ భావముచే భేదదృష్టిని పొంది రాగద్వేషములను పెంపొందించెదరు.

బాలదృష్టియందు శాస్త్రాభ్యాసము చేసినను, గురువులవద్ద విద్యను అభ్యసించినను అనుభవము కలుగదు. ఎప్పుడో ఒకప్పుడు రాగద్వేషములు స్ఫురించును. తత్త్వవిచారమే వానిని తప్పించగలుగును.

పురుషదృష్టియందు జగమంతయును నాస్వరూపమే అను జ్ఞానము కలుగును. అట్టివారియందు రాగద్వేషములు ఉండవు.

మొదటివానిని అజ్ఞానియనియు, రెండవరకపు వ్యక్తిని జిజ్ఞాసువు అనియును, మూడవరకపు వ్యక్తిని జ్ఞానియనియు చెప్పవచ్చును.

భగవానుడు చెప్పెను:— దేహముద్దిశ్య పశువత్ వైరం కుర్యాత్ న కేనచిత్ ।

"పశువువలె దేహముకొరకు ఎవరితోను వైరమును పొందరాదు."

పశుపక్ష్యాదులకు "నేను దేహాభిన్నముగు ఆత్మను" అను జ్ఞానము కలుగదు. మనుష్యులకుమాత్రము శాస్త్రముద్వారా అట్టి జ్ఞానము కలుగును. మనుష్యులలోకూడ పామరులకును విషయలంపటులకును "నేను దేహాభిన్నముగు ఆత్మను" అను ప్రకాశము కన్పించదు. వారుకూడ పశువులవలెనే తలచెదరు. కాని జిజ్ఞాసువులు మాత్రము శాస్త్రముద్వారా తెలిసికొనెదరు. జ్ఞానులు పూర్ణాను

భవముద్వారా తమ వాస్తవికస్వరూపమును తెలిసికొని ఆనందమును పొందెదరు. తన వాస్తవికస్వరూపమును తెలిసికొనసంతవరకును మనుష్యుడుకూడ పశువుతో సమానుడేనని గ్రహించవలెను.

"జ్ఞానేన హీనాః పశుభిః సమానాః" "జ్ఞానములేనివారు పశువుతో సమానులు" అని శాస్త్రములు ఘోషించుచున్నవి.

ఇంతలో ఒక బ్రాహ్మణుడు కన్యాదానము చేసికొనుటకు ఏమైన ఇప్పించవలెనని వేడుటకు రాజుగారివద్దకు వచ్చెను. "ఇప్పుడు కాళీ లేదు. రేపు రమ్ము" అని రాజుగారు సమాధానము చెప్పిరి.

స్వా. ని. :—ధర్మరాజు దగ్గరకు ఒకనాడు ఒకయాచకుడు వచ్చెను. ఆతనితో ధర్మరాజు రేపు రమ్ము నేడు కాళీలేదని చెప్పెను. ఆసమయమున భీమసేనుడు అచ్చటనే కూర్చొనియుండెను. ఆతడు వెంటనే వెళ్ళి మంగళవాయిద్యములు వాయించ మొదలిడెను. అది విని ధర్మరాజడిగెను:— నేడు మంగళవాయిద్యములు ఎవరు వాయించుచున్నారు? ఆయన సహదేవునికి చూచిరమ్మని అజ్ఞాపించెను. సహదేవుడు చూచి వచ్చి భీమసేనుడు మంగళవాయిద్యములు వాయించుచున్నాడని చెప్పెను. అంతట భీమసేనుని పిలిపించి ధర్మరాజు అడిగెను:— "నేడు ఏవిధముగా ఆనందించవలసినరోజు? ఎందుకు నీవు మంగళవాద్యములు వాయించుచున్నావు?"

భీమసేనుడు చెప్పెను:— మీరే ఆయాచకుని రేపు రమ్మని చెప్పిరి. మీరు సత్యవచనులు. రేపటివరకు మీరు జీవించెదరను ఆనందముతో మంగళవాయిద్యములు వాయించుచున్నాను.

ఈసమాధానము విని ధర్మరాజు సిగ్గుపడి, ఆ బ్రాహ్మణుని వెంటనే పిలిపించి సత్కరించెను. జనులను రమ్మనుచును పొమ్మనుచును ఉండరాదు. వెంటనే దానము చేయవలెను. "త్వరితదానం మహాపుణ్యమ్ ।" అని చెప్పబడినది. రాజుగారు శ్రీప్రకాశానందుల

వారిని ఉద్దేశించి పలికిరి:—ఇట్టియాచకులు పలువురు వచ్చెదరు. కాని అందరను కలసికొనుటకు అవకాశము ఉండదు. అయినను శక్తికొలది చేయుదును.

స్వా. ప్ర. :—ఒక రాజు సభ చేసెను. ఆసభలో ఒకవైపున అధికారులును, మరియొకవైపు వర్తకులును కూర్చొనిరి. రాజుదగ్గర నగర శ్రేష్ఠి కూర్చొనియుండెను. రాజు నగరశ్రేష్ఠిని అడిగెను:–నీవద్ద ఎంతధనము కలదు? నీకు ఎంతమంది సంతానము?''

న. శ్రే. :–"నాదగ్గర 25 లక్షల రూపాయిలు కలవు. నాకు ఒక కుమారుడు కలడు." ఈసమాధానమును విని అందరును విచారించిరి. నగర శ్రేష్ఠి ఈవిషయమును గమనించి ఇట్లు పలికెను:— నేను చెప్పిన మాటలను తమరు తెలిసికొనలేదు. నాదగ్గర ధనమైతే 5 కోట్లు కలదు. కాని అందులో 25 లక్షలుమాత్రమే నాచేతితో ధర్మముచేసితిని. అది నాపరలోకమున దాచబడినది. అటులనే బిడ్డలు నలుగురు కలరు. కాని వారిలో ఒకడే నాఆజ్ఞను మన్నించును. శరీరమునందు పుట్టిన క్రిమికీటకాదులవలె మిగిలినవారు నన్ను బాధించెదరు. కావున వారిని నేను బిడ్డలనుకొనుటలేదు. "పుత్రోయస్తు భక్తిమాన్" "భక్తి కలవాడే పుత్రుడు." అదేవిధముగా తనచేతితో సన్మార్గమున ఉపయోగించబడిన ధనముమాత్రమే మనతో వచ్చును.

*ధనాని భూమౌ పశవశ్చ గోష్ఠే భార్యా గృహద్వారిజనాః శ్మశానే*
*దేహశ్చితాయాం పరలోకమార్గే కర్మానుగో గచ్ఛతి జీవ ఏకః॥*

"దేహపాతముతో ధనము భూమిమీద పడిపోవును. పశువులు పశుశాలలో ఉండిపోవును. భార్య ఇంటిగుమ్మముకువద్ద ఉండును. ఇతర జనులు శ్మశానమువరకుమాత్రమే వచ్చెదరు. శరీరము చితి యందు ఆగిపోవును. కర్మలతోకూడిన జీవుడుమాత్రమే పరలోకము నకు పోవును. అనగా మృత్యువుతరువాత దారాపుత్రాదులు ఎవ

ళును కూడరారు. కర్మను అనుసరించి ఒంటరిగా పరలోకమునకు పోవును.

రాజు:— తమవంటి మహాత్ములు నేను ఎల్లప్పుడును సత్కర్మలను ఆచరించుచుండునట్లు ఆశీర్వదించండి. ఇదే నాప్రార్థన.

నాదగ్గరకు అడుగుటకు చాలమంది వచ్చెదరు. అందరకును నేను ఎక్కడనుండి ఇవ్వగలను? నేను సామాన్యసంసారినయితే ఎవరును రారు. పెద్దరాజ్యము ఉన్నచో అడిగినంతయు ఇవ్వగలిగియుండెడివాడను. నాదురదృష్టముచే చాలమందికి లేదని చెప్పవలసివచ్చుచున్నది. నాస్థితి "గోచీకి పెద్ద, అంగవస్త్రమునకు చిన్న".

స్వా. ప్రి. :— ఒకగ్రామము బైటను ఒకయోగి వచ్చియుండెను. వారి దర్శనమునకు ఒక భూస్వామి వెళ్ళెడివాడు. నిత్యము ఆయనకు సేవచేసెడివాడు. నాలుగైదు మాసములతరువాత ఆభూస్వామి యోగిగారికి తన దుఃఖమును వెల్లడించెను:— "నాకుమారులకును, కుమార్తెలకును పెండ్లిండ్లు చేయవలసియున్నది. తగిన ధనము లేదు. మాజాతిలో చాల ఖర్చు అగును. మాజాతివారే దర్బారు రాజుగారు ఎంతయో సుఖముగానున్నారు" అనెను. యోగిగారు నీఅదృష్టమునుబట్టి లభించును అని చెప్పిరి. అనంతరము దైవవశమున దర్బారురాజుగారు సంతానములేకుండా చనిపోయిరి. ఆ భూస్వామి వారికి సమీపవారసుడు అగుటచే అధికారము లభించెను. అతడు ఎంతయో సంతోషించెను. కాని రెండుమూడుసంవత్సరములలో ఆస్థితియందుకూడ అసంతృప్తి కలిగెను. అతడు మరల యోగిగారి వద్దకు వెళ్లి పలికెను:—"లౌకిక బాధ్యతలు పెరిగిపోయినవి. ఖర్చులు పెరిగిపోయినవి. వచ్చుధనము అందుకుకూడ సరిపోవుటలేదు. ఇంతకంటె భూస్వామిజీవితమే మేలు. ఏదైన పెద్దరాజ్యము ఉన్నచో బాగుండును. అనేకమంది నాదగ్గరకు వచ్చెదరు. వారికి ఏమి

చెప్పను?" కొలదికాలములో ఆదేశపు పెద్దరాజే వంశహీనుడయ్యెను. వారివంశమునకుకూడ ఈరాజుగారే సమీపబంధువు అగుటచే ఆరాజ్యముకూడ ఇతనికే దక్కెను. ఇక అతని ఆనందమునకు అంతులేదు. నెమ్మది, నెమ్మదిగా రాజ్యము అనినకూడ ఆతనికి విరక్తి కలిగెను. ఆతడు యోగివద్దకు వెళ్ళి చెప్పెను:— ఈరాజ్యము ఉపాధిని పెంచుచున్నది. ఉరి, శరీరదండన, ఇతరరాజులతో శత్రుత్వము— ఇట్టి అనేక కృత్యములు నాకు ఇష్టములేనివి చేయవలసివచ్చుచున్నది. ఈమాటలు విని యోగిగారు ఇట్లనిరి:— "నిజమగు సుఖము కోరుచో నావలె గుహలో కూర్చొనుము. యోగాభ్యాసముచేసి బ్రహ్మసుఖమును పొందుము. ఈసర్వవిధదుఃఖములనుండియు ముక్తిని పొందుము. ఏసాంసారికవస్తువునందును సుఖము కలుగదు.

భర్తృహరి చెప్పెను:—

*నిష్కణ్టకేఽపి న సుఖం వసుధాధిపత్యే*
*కస్యాపి రాజతిలకస్య యదేష దేవః ।*
*విశ్వేశ్వరో భుజగరాజవిభూతిభూషో*
*హిత్వా తపస్యతి చిరం సకలా విభూతీః ॥*

"భూమిపై నిష్కంటకరాజ్యమును సంపాదించినను సుఖమును పొందలేము. కావుననే పెద్దపెద్దసర్పములను, భస్మమును అలంకారములుగా ధరించి విశ్వేశ్వరమహాదేవుడు సకలవిభూతులను త్యజించి చాలకాలము తపము చేసెను."

స్వామిశంకరానందులు రాజుగారితో వినోదార్థము పలికెను:—

తమకు పరమాత్ముడు చిన్నరాజ్యమును ఇచ్చెను. భూస్వామి అయినచో బీదలకు దానముకాని, సన్యాసులకు భిక్షకాని చేయలేక పోయెడివారు. పెద్దరాజ్యము ఉన్నచో స్వాములను, సన్యాసులను, మహాత్ములను దర్శించుటకుకూడ వీలు కలిగియుండెడిది కాదు. 'ఈ

బాబాలతోను, సాధువులతోను మనకు ఏమిపని? వీరి సాంగత్యము మనకు ఎందులకు? నేను పెద్దరాజును.' అనుకొని గర్వముతో సన్న్యాసులకు దూరముగా తొలగిపోయియుండెడివారు. తమరు సామాన్య భూస్వామియును కారు. పెద్దరాజును కారు. మీకు భోగభాగ్యములకు లోటుకూడ ఏమియును లేదు. 40, 50 మోటార్లు కలవు. పెద్ద పెద్ద బంగళాలు కలవు. సర్వవిధసౌఖ్యములను అనుభవించుచుకూడ ఉన్నారు. వీనితోపాటు స్వాములయొక్కయు, సన్న్యాసులయొక్కయు సాంగత్యమునుకూడ పొందుచున్నారు.

స్వా. ప్ర. :—శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు.

*న విషయభోగో భాగ్యం యోగ్యం ఖలు యత్ర జన్తుమాత్రమపి।*
*బ్రహ్మేన్ద్రరుద్రమృగ్యం భాగ్యం విషయేషు వైరాగ్యమ్॥*

"విషయభోగము జంతువులకుకూడ భాగ్యము కాదు. బ్రహ్మయు, ఇంద్రుడును, రుద్రుడునుకూడ విషయవైరాగ్యము అనెడు భాగ్యమును వెదకుదురు."

మెఱుపు వెలుతురువంటి క్షణికములగు మాయికపదార్థములయందు వైరాగ్యము కలుగుట నిజమగు భాగ్యము. ఆవైరాగ్యాది సాధనములు బ్రహ్మసుఖమును లభింపజేయును.

ఇది విని శ్రీస్వామినిత్యానందులు ఎంతయో ఆనందించిరి.

ఆటుతరువాత స్వామి శ్రీప్రకాశానందులవారు మోటారు మార్గమున రాజకోట వెళ్లుటకు బయలుదేరిరి. ఈసమయమున భక్తరాజు పలికెను:— నేను కొద్దిరోజులతరువాత కాశీ మొదలగు పుణ్యక్షేత్రములు వెళ్లుదును. అనంతరము ఏకాంతమున కూర్చొనవలెనని యున్నది.

స్వా. ప్ర. :—ముస్లిముమహాపురుషులలో ఒకడగు అబ్దుల్లా మక్కాలో తాను చేయవలసిన పనులుచేసి మసీదునందలి ఒకపార్శ్వమున నిద్రించుచుండెను. నిద్రలో ఆతడు స్వప్నమును కాంచెను.

ఇద్దరు దేవదూతలు స్వర్గమునుండి క్రిందికి దిగుచుండిరి. ఒక దేవదూత రెండవదూతను అడిగెను:— ఈమారు ఎంతమంది మక్కా-యాత్రకు వచ్చిరి?

ఆతడు చెప్పెను:— మొత్తము ఆరులక్షలు.

"వారిలో ఎందరియాత్రకు దేవుడు సంతోషించెను?"

"ఆరులక్షలమందిలోను ఎవరియాత్రయును సఫలము కాదు."

ఈసంవాదమువిని అబ్దుల్లాను ఎంతయో దుఃఖము కలిగెను. ఆతడు పలికెను:— అయ్యో! దూరదేశములనుండి ఇంతమంది యాత్రికులు నానావిధములగు దుఃఖములను సహించి, శ్రమపడి దీర్ఘమగు మార్గమును దాటి, పర్వతములు, అరణ్యములు, మరుభూములు మొదలగువానిని దాటి మక్కా-యాత్రకు వచ్చిరే! వారి అందరి పరిశ్రమయును, వారు సహించిన కష్టములును వ్యర్థమైపోయెనా!"

మొదటి దేవదూత:— డెమాస్కస్ నగరమున ఒక చర్మకారుడు కలడు. అతనిపేరు అలీఅల్‌మవుఫ్. ఆతడు మక్కా-యాత్రకు రాలేకపోయెను. అయినను ఆతనికి మక్కా-దర్శనఫలమును, తీర్థాటనఫలితమును ఇంటకూర్చొని ఉండగనే లభించెను.

ఇది వినినంతనే అబ్దుల్లా స్వప్నమునుండి మేల్కొనెను. డెమాస్కస్‌నగరమువెళ్లి ఆచర్మకారుని దర్శనము చేయవలెనని ఆతనికి తోచెను. ఆతడు డెమాసకస్ నగరమార్గమును పట్టెను. వెతకుచు వెతకుచు అబ్దుల్లా, అలీఅల్‌మవుఫ్ ఇంటికి చేరెను. అబ్దుల్లా పిలుపు విని ఒక మనుష్యుడు బైటికివచ్చెను. ఆతనిని అబ్దుల్లా ప్రశ్నించెను:— "నీవు ఏమిపనిచేయుదువు?"

"నేను చెప్పులు కుట్టెదను"

"నేను నీకు ఒకప్రధానవిషయము చెప్పవలసియున్నది."

"దయతో చెప్పండి."

అంతట అబ్దుల్లా స్వప్నవృత్తాంతమును అతనికి వినిపించెను. ఆతడు అబ్దుల్లాను "మీరు ఎవరు" అని ప్రశ్నించెను. "అబ్దుల్లా" అని వినగానే గట్టిగా ఒక అరపుఅరచి స్పృహతప్పి పడిపోయెను. కొంత సేపటికి ఆతనికి తెలివివచ్చిన తరువాత అబ్దుల్లా అతనిని తనగతచరిత్ర చెప్పుమని అడిగెను.

నేటికి 20, 30 సంవత్సరములనుండి మక్కా-యాత్రి చేయవలె నను తలంపుతో నేను చెప్పులు కుట్టినధనములో కొంచెము కొంచెము ఇంటికర్చులు పోగా మిగుల్చుకొంటిని. ఈసంవత్సరము మక్కా-యాత్రికు బయలు దేరితిని. నాభార్య గర్భవతి. ఒకరోజున మాపొరి గింటి వంటవాసన నాభార్య ఆఘ్రాణించి ఆవంటకమును భుజించవలె నను కోరికను వ్యక్తముచేసెను. ఆమె నాతో నిట్లనెను:–"వారి ఇంటికి వెళ్ళి ఆవంటకములోనుండి కొంచెము అడిగి నాకు తీసికొనిరమ్ము."

ఆమెమాటలు ప్రకారము నేను ఆపదార్థమును అడుగుటకు పొరుగింటికి వెళ్ళితిని. వారు ఇట్లు చెప్పిరి:– "ఏడురోజులనుండి మా యింటనున్న చిన్నపిల్లలతో సహా అందరము ఆకలితో ఆహారములేక ఉంటిమి. చివరకు చేయునదిలేక నేను ఒక చచ్చిన జంతువుయొక్క-మాంసమును తెచ్చితిని. అది నేడు మాయింట వండబడినది. అట్టి మాంసము శాస్త్రమునందు నిషిదముగా పరిగణించబడినది. అది నేను మీకు ఇవ్వను." నాపొరుగింటి యజమాని చెప్పిన ఈమాటలతో నాహృదయము ఎంతయో బాధపడెను. నేను ఇంటికివచ్చి మక్కా-యాత్రికు నిలవచేసిన ధనమంతయును నాపొరుగింటి యజమానునికి ఇచ్చితిని. ఆతనితో నేను ఇట్లు పలికితిని:– "నేను మక్కా-వెళ్ళుటకు వలయు మార్గవ్యయమునకు ఈధనమును నిలవచేసితిని. దీనితో నీవు సుఖముగా ఆహారపదార్థములను కొనుక్కొని భుజించుము. పిల్లలకు బట్టలు కుట్టించుకొనుము. నేడు నామక్కా-యాత్ర ఇక్కడనే అయి నది. నాతీర్థదర్శనము ఇచ్చుటనే జరిగినది" అని చెప్పితిని.

ఇవి అబ్దుల్లాతో ఆచర్మకారుడు చెప్పినమాటలు.

కావున మీదగ్గర డబ్బుఉన్నచో బీదలకు ఇచ్చుటయుక్తము.''

ఉత్తమా సహజావస్థా మధ్యమా ధ్యానధారణా ।
అధమా ప్రతిమాపూజా తీర్థయాత్రా ఒధమాధమా॥

"జ్ఞానికి సహజావస్థ ఉత్తమమయినది. ధ్యానము మధ్యమ మార్గము. విగ్రహారాధన ఆతనికి అధమమైనది. తీర్థయాత్ర అధమాధమమే."

జ్ఞానికి సహజావస్థ అనగా సహజసమాధి ఉత్తమమైనదిగా పరిగణించబడినది. ఏకాంతమున కూర్చొని ధ్యానము, యోగము మొదలగునవి ఆచరించుట ఆతనికి మధ్యమమార్గము. విగ్రహారాధన ధ్యానధారణముకంటెను స్థూలముయినది. కాన కనిష్ఠమైనదిగా పరిగణించబడినది. తీర్థాటనమునందు తినుట, త్రాగుట, ఆడుట మొదలగువానియందు అనేకవిధములగు ఇబ్బందులు ఉండుటచే నిత్యకర్మోపాసన అయినను సమయమునకు జరుపుకొనుటకు వీలుపడదు. కావున తీర్థాటనము అధమాధమము అని చెప్పబడినది. అయినను మీకు అట్టికోరిక యున్నచో చేసికొనిరండు.

రాజుగారు:— బాపూ. తమరు ఎప్పుడు దయచేయుదురు?

స్వా. ప్ర. :— నిత్యానందస్వామివారు ఇక్కడే ఉన్నారు కదా! త్రోవను వచ్చుచు, పోవుచు ఉన్నప్పుడు స్వాభావికముగనే ఆకర్షణ కలుగునుకదా!

రాజు:— తమవంటి గొప్పసన్యాసి (గొప్పత్యాగి) పాదములతో మాగృహము పవిత్రము అవును. దయయుంచి తమరు తప్పక దయచేయుచుండుడు.

స్వా. ప్ర. :— (రాజుగారు ఉపయోగించిన "గొప్ప" అను పదమునకు గల రెండవ అర్థమును ఆధారముగా తీసికొని) నేనుగొప్ప త్యాగిని. ఇది మాత్రము మీరు నిజమే చెప్పిరి.

త్యాగము రెండు రకములు. 1. మాయికపదార్థములను త్యజించుట. భర్తృహరి మొదలగువారు మాయాకార్యములగు రాజ్యాదులను త్యజించి బ్రహ్మమును పొందిరి. అనగా సామాన్యమైన వానిని త్యజించి గొప్పదగు బ్రహ్మమును పొందిరి.

2. బ్రహ్మత్యాగము:— నేను గొప్పదగు బ్రహ్మమును త్యజించి తుచ్ఛములగు మాయికపదార్థములను అంటిపెట్టుకొనుచున్నాను. కావున నేను. "గొప్పత్యాగిని" అనగా గొప్పదియగు వస్తువును త్యజించినవాడను.

రాజు:— బాపూ! ఇంత తలక్రిందుగా ఎందుకు చెప్పుచున్నారు? అట్టివాడను నేను. ప్రభువును త్యజించి కూర్చొని ఉన్నాను. తమరు కాదనినను దేశము అంతయును తమను త్యాగి అనియే చెప్పుచున్నది. అది అంతయును అసత్యమా!

స్వా. ప్ర:— (వినోదార్థము) నన్ను దేశములో అందరు ఎరుగుదురు అనునదికూడ యథార్థమే. గాయకురాలిని దేశము అంతయును ఎరిగియుండును. కాని పతివ్రతనుమాత్రము ఎరిగియుండదు. ఏలనన ఆమె ఏదో ఒకబట్ట కట్టుకొని ఏకాంతమున తనభర్తసేవచేసికొనుచు ఉండును. ఆమెను ఎవరు తెలిసికొనెదరు?

అంతట అందరు పకపక నవ్వసాగిరి.

అనంతరము స్వామిశ్రీప్రకాశానందులవారు రాజకోట వేంచేసిరి. భక్తరాజు మొదలగువారు జేతపురము వెళ్లిరి.